క్లుప్తంగా

జిల్లా కేంద్రానికి వెళ్లి పింఛన్ పంపిణీ



పెనమలూరు: ఓ వలంటీర్ జిల్లా కేంద్రమైన మచిలీపట్నం వెళ్లి లబ్ధిదారుకు పింఛన్ కానుక అందచేసి తన చిత్తశుద్ధిని చాటుకుంది. వణుకూరుకు చెందిన మోటూరి సంతోషమ్మ మచిలీపట్నం వెళ్లి అక్కడ అనారోగ్యానికి గురైంది. ఆమె అక్కడి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ సమాచారం తెలుసుకున్న వణుకూరు గ్రామ వలంటీర్ తుణుకు లక్ష్మి సోమవారం మచిలీపట్నం సంతోషమ్మకు పింఛన్ కానుక అందచేసింది.

ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేత

కంకిపాడు: మండలంలోని పునాదిపాడు గ్రామానికి చెందిన దొండపాటి దేవదాసు వృద్ధాప్య పింఛను లబ్ధిదారు. అనారోగ్యం కారణంగా పెద అవుటపల్లి పిన్నమనేని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వలంటీరు జి.వెంకటరమణ సోమవారం ఆస్పత్రికి వెళ్లి పింఛను సొమ్ము అందజేశారు. అత్యవసర సమయంలో సొమ్ము చేతికి అందటంతో ఆ కుటుంబం సంతోషం వ్యక్త చేసింది. వెంకటరమణ చొరవను అధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

పెనమలూరు ఎంఈఓగా శేషగిరిరావు



పెనమలూరు: మండల విద్యాశాఖాధికారిగా బి.వి.శేషగిరిరావు సోమవారం విధుల్లో చేరారు. ప్రభుత్వం నిర్వహించిన కౌన్సెలింగ్‌లో శేషగిరిరావును పెనమలూరు ఎంఈఓ-1గా ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ మేరకు శేషగిరారావు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సునీతా శర్మకు జాయినింగ్ రిపోర్టు అందజేశారు.

కుష్ఠు నిర్మూలనకు కృషి చేయాలి



కంకిపాడు: కుష్ఠు వ్యాధి నిర్మూలనకు బాధ్యతతో పనిచేయాలని జిల్లా లెప్రసీ అధికారి వెంకటరావు సూచించారు. ఉప్పలూరులో కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వేను ఆయన సోమవారం పరిశీలించారు. ఇంటింటి సర్వే, వ్యాధి నిర్ధారణపై ఆరోగ్య సిబ్బంది సేకరిస్తున్న వివరాలకు సంతృప్తి వ్యక్తం చేశారు. వెంకటరావు మాట్లాడుతూ స్పర్శ లేని మచ్చలను కుష్ఠు లక్షణంగా గుర్తించాలన్నారు. డీఎస్ఎంఓ వేణుగోపాలకృష్ణ, వైద్యాధికారి డాక్టర్ సుందర్‌కుమార్, డీపీఎంఓ శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్ రాచమల్ల శ్యాంప్రసాద్, ఏఎన్ఎం భవాని, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పేరంటాలమ్మ ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం రేపు

రామవరప్పాడు: స్థానిక శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయ నూతన ధర్మకర్తల మండలి కార్యవర్గం బుధవారం ప్రమాణ స్వీకారం చేయనుంది. వరుసగా రెండోసారి ఎన్నికైన ఆలయ చైర్మన్ బోయిన భానుప్రదీప్ మాట్లాడుతూ ఈ ఏడాది ఫిబ్రవరి 26న గత పాలక వర్గ పదవీకాలం ముగిసిందన్నారు. ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్, మాజీ ఏఎంసీ చైర్మన్ కొమ్మా కోట్లు సహకారంతో ఎనిమిది మందితో కూడిన ధర్మకర్తల మండలి సభ్యుల పేర్లను దేవదాయశాఖ ఉన్నతాధికారులు ప్రకటిస్తూ ఉత్వర్వులు జారీ చేశారన్నారు. బుధవారం తనతో పాటు సభ్యులుగా మత్తె కిరణ్ కుమార్, దొండపాటి అచ్చుతరావు, అంగిరేకుల సునీత, శిఖాకొల్లి యల్లమందయ్య, మాచెర్ల అరుణకుమారి, వేమినేని రజిత, ఉప్పు శివలీల, కాకాని ప్రశాంతి ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలిపారు.

స్వచ్ఛందసేవా సంస్థ ఆధ్వర్యంలో చెరువు అభివృద్ధి



పాతపాడు(విజయవాడరూరల్): పాతపాడు గ్రామంలోని ఎర్ర చెరువును ఎన్విరాన్‌మెంటల్ ఫ్రెండ్లీ ఇండియా అనే స్వచ్ఛంద సేవా సంస్థ అభివృద్ధి చేస్తోంది. మూడు రోజులుగా పొక్లెయిన్‌తో చెరువు లోపల భాగం మట్టిని తీసి కట్టను బలోపేతం చేసే పనులు జరుగుతున్నాయి. చెరువు చుట్టూ ఫెన్సింగ్, వాకింగ్‌ట్రాక్ నిర్మాణం, చెట్ల పెంపకం వంటి అభివృద్ధి పనులను స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తుందని గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎస్.చెన్నకేశవరావు తెలిపారు. చెరువులోకి పక్షులు వచ్చే విధంగా తగిన సదుపాయాలను కల్పించేందుకు కూడా సంస్థ ప్రతినిధులు చర్యలు తీసుకుంటారని కార్యదర్శి తెలిపారు. చెరువును అభివృద్ధి చేయడం వలన గ్రామంలోని ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని, వాకింగ్ ట్రాక్ నిర్మాణంతో ప్రజలు ఆరోగ్యకరంగా ఉండేందుకు దోహదం చేస్తుందని పేర్కొన్నారు. స్వచ్ఛంద సేవాసంస్థ చేస్తున్న అభివృద్ధి పనుల పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జగనన్న సురక్షతో సుపరిపాలన



ఆకునూరులో సర్టిఫికెట్లు అందిస్తున్న కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే పార్థసారథి



పెదపులిపాక గ్రామంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ రాజాబాబు

కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు

ఉయ్యూరు/పెనమలూరు: జగనన్న సురక్ష కార్యక్రమంతో సుపరిపాలనకు శ్రీకారం చుట్టారని కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. ఉయ్యూరు మండలంలోని ఆకునూరు, పెనమలూరు మండలంలోని పెదపులిపాక గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఆకునూరు సచివాలయంలో నిర్వహించిన సభలో 11 రకాల సేవలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను అధికారులు లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ.. స్పందన, జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్షతో పాలనలో విప్లవాత్మక మార్పులు తెచ్చారన్నారు. ఏడు రోజుల వ్యవధిలో 11 రకాల ధ్రువీకరణ పత్రాలను అధికారులే ఇంటింటి సర్వే నిర్వహించి అందించే కార్యక్రమం గతంలో ఎన్నడూ జరగలేదన్నారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తాము చదువుకునే రోజుల్లో కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు కోసం రోజుల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగేవాళ్లమని గుర్తుచేసుకున్నారు. ఇప్పుడు ఇంటి వద్దే సర్టిఫికెట్లు ఇస్తున్నారని, ఇది గుడ్ గవర్నెన్స్ అని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో విప్లవాత్మక, వినూత్న మార్పులు తెచ్చారని కొనియాడారు. దేశంలోనే ఆదర్శ పాలనకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. సీఎం జగన్ చేపడుతున్న కార్యక్రమాలతో ఇతర రాష్ట్రాలు ఆంధ్ర రాష్ట్రం వైపు చూస్తున్నాయన్నారు. ఆర్డీఓ ఎస్.విజయ్‌కుమార్, సర్పంచ్ వసంతరావు, వైస్ ఎంపీపీ రాచాబత్తుల మధుసూదన్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ యార్లగడ్డ సాయి, తహసీల్దార్ మస్తాన్, ఎంపీడీఓ విమాదేవి, డీఎల్‌డీఓ నాంచారావు, నాయకులు దాసే రవి, గారపాటి నాని తదితరులు పాల్గొన్నారు.

పెదపులిపాకలో..

పెదపులిపాక గ్రామంలో గ్రామస్తుల నుంచి 225 సమస్యలు అధికారుల దృష్టికి రాగా వారందరికీ సర్టిఫికెట్లు జారీ చేశారు. 175 మందికి కౌలు రైతు కార్డులు అందజేశారు. ఇళ్ల స్థలాలు రాని వారు వెంటనే దరఖాస్తు చేయాలని సూచించారు. ఈ మేరకు సర్టిఫికెట్లు కలెక్టర్ రాజబాబు గ్రామస్తులకు అందచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ.. అధికారులు సమన్వయంతో సమస్యలను పరిష్కరిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను చెప్పుకోవడానికి 1902 టోల్‌ఫ్రీ నంబర్‌ను తీసుకొచ్చారని వివరించారు. వలంటీర్లు గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకొస్తున్నారని అన్నారు. ప్రజలు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి గంటూరు శ్రీనివాస చౌదరి, ఆర్డీఓ విజయ్‌కుమార్, తహసీల్దార్ వెంకట శివయ్య, ఎంపీడీఓ సునీతాశర్మ, చోడవరం సర్పంచి కాకర్ల వెంకటరత్నం, డీఆర్‌డీఓ నాంచారావు, ఏఓ కనకమేడల శైలజ, ఈఓపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, మండల పరిషత్ ఏఓ లోయ శివశంకర్, ఈఓ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో న్యాయం



జగనన్న సురక్ష కార్యక్రమంతో నా కుటుంబానికి న్యాయం జరిగింది. కుల ధ్రువీకరణ పత్రంతో పాటు, జనన ధ్రువీకరణ పత్రం కావాలని వలంటీర్‌ను సర్వేలో కోరాను. వలంటీర్ టోకెన్ ఇచ్చిన వారం రోజుల్లో అధికారులు సర్టిఫికెట్లు అందజేశారు. జగనన్న సురక్ష కార్యక్రమం అమలు బాగుంది.

– గుండు రత్నం, పెదపులిపాక గ్రామం పెనమలూరు మండలం

పేదల సంక్షేమమే ధ్యేయంగా జగన్ పాలన



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్

హనుమాన్‌జంక్షన్ రూరల్: పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అన్నారు. మండల కేంద్రమైన బాపులపాడు గ్రామ సచివాలయం-1లో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సర్పంచ్ సరిపల్లి కమలాబాయి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే వంశీమోహన్ మాట్లాడుతూ గత తెలుగు దేశం ప్రభుత్వ హయాంలో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమాల్లో గ్రామగ్రామాన వేల సంఖ్యలో ప్రజల నుంచి అర్జీలు వచ్చినప్పటికీ, వాటిని పరిష్కరించేందుకు నాటి ప్రభుత్వం ఎలాంటి చొరవ చూపించలేదని విమర్శించారు. కుప్పలుతెప్పలుగా వచ్చిన జన్మభూమి అర్జీలు చివరికి బుట్టదాఖలయ్యేవని చెప్పారు. కానీ నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వలంటీర్లే ఇంటింటికీ వెళ్లి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, జగనన్న సురక్ష కార్యక్రమంలో సర్టిఫికెట్లు జారీ చేయటం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్తశుద్ధికి నిదర్శనమని కొనియాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజాప్రతినిధిగా సేవ చేయటం ఎంతో గౌరవాన్ని, సంతృప్తిని ఇస్తుందన్నారు. జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్ మాట్లాడుతూ ప్రజలకు నూరుశాతం సంక్షేమ పథకాలను చేరవేయాలనేదే ప్రభుత్వ లక్ష్యంగా చెప్పారు. జగనన్న సురక్ష ద్వారా స్వీకరించిన అర్జీలను సత్వరం పరిష్కరిస్తున్నామని తెలిపారు. అనంతరం వలంటీర్ల సర్వేల్లో వచ్చిన అర్జీలను పరిష్కరించి 650 మందికి వివిధ సర్టిఫికెట్లను ప్రజాప్రతినిధులు, అధికారుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. గుడివాడ ఆర్డీవో పి.పద్మావతి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ పీఎస్ఆర్ ప్రసాద్, తహసీల్దార్ సీహెచ్ నరసింహారావు, ఎంపీడీవో కె.జోగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు అవిర్నేని శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, పీఏసీఎస్ చైర్మన్ దయాల విజయనాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు మత్తి లక్ష్మీమాధవి, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్‌మూర్తి, మాజీ ఉప సర్పంచ్ వేగుంట ఉషామణి పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



ఉయ్యూరు పదోవార్డులో సంక్షేమ పాలన వివరిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఉయ్యూరు: పేదల ఆర్థికాభ్యున్నతే ధ్యేయంగా తమ ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. ఉయ్యూరు పదో వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం జరిగింది. ఎమ్మెల్యే పార్థసారథి ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధి వివరాలతో రూపొందించిన సంక్షేమ బ్రోచర్లను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ.. టిడ్కో గృహాల పంపిణీ త్వరితగతిన జరిగేలా కృషి చేస్తున్నామన్నారు. సంక్షేమ కార్యక్రమాల అమలులో రాజీ పడటం లేదన్నారు. మునిసిపల్ చైర్మన్ వల్లభనేని నాని, వైస్ చైర్మన్ అర్షతున్నీసా బేగం, ప్రభుత్వాస్పత్రి చైర్మన్ జంపాన కొండలరావు, కౌన్సిలర్ గుంజా సుధాకర్, కో ఆప్షన్ సభ్యుడు షేక్ ఖలీల్, నాయకులు వణుకూరు సురేష్, వడుపు కార్తీక్, జనార్దన్, బొబ్బిలి నాగరాజు, అబ్దుల్ సద్దాం, దిరిశం ఇందిరా ప్రియదర్శిని, మునిసిపల్ కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా శ్రీనివాస కల్యాణం



పోరంకిలో కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న పురోహితులు

పెనమలూరు: మండలంలోని పోరంకి గ్రామం విష్ణుపురంకాలనీలో వేంచేసి ఉన్న శ్రీ విజయ వినాయక స్వామి దేవస్థానంలో ఆదివారం రాత్రి శ్రీ శ్రీనివాస కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. ఆగమ పండితుడు హరినవీన్, శిష్య బృందం శాస్త్రోక్తంగా శ్రీనివాస కల్యాణాన్ని నిర్వహించారు. తొలుత సుప్రభాతసేవ, తోమాలసేవ, తులసీ దళాలతో సహస్రనామార్చన, హోమం, పలు పూజా కార్యక్రమాలు చేశారు. ఆదివారం రాత్రి 9 గంటలకు శ్రీనివాస కల్యాణ మహోత్సం అత్యంత వైభవంగా చేశారు. భక్తులు కల్యాణ మహోత్సవంలో పాల్గొని కనులపండుగగా తిలకించారు. కాలనీ పాలక వర్గంతో పాటు, కాలనీ వాసులు, గ్రామస్తులు భక్తులు ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు

పెనమలూరు: మండల కేంద్రమైన పెనమలూరు గ్రామంలో ఓ విద్యార్థిని అదృశ్యం కావటంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. సీఐ ఎం.కిషోర్‌బాబు కథనం మేరకు.. విజయనగరం జిల్లా జి.ఎం.వలన మండలం, మూడవలన గ్రామానికి చెందిన రెడ్డి సతీష్‌నాయుడు ఆరేళ్లుగా పెనమలూరులో ఉంటూ వంట పనులు చేస్తున్నాడు. అతని ఇద్దరు కుమార్తెలు విజయనగరంలోని స్వగ్రామంలో ఉంటున్నారు. అతని తల్లి ఆరోగ్యం బాగాలేదని పెద్ద కుమార్తె (14)ను పెనమలూరుకు తీసుకొచ్చి పదో తరగతిలో చేర్పించాడు. అయితే ఆదివారం సాయంత్రం ట్యూషన్‌కు వెళ్లి వస్తానని ఆ బాలిక ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. సతీష్‌నాయుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

భక్తిప్రపత్తులతో గురుపౌర్ణమి



ఉయ్యూరులో సాయిబాబాకు పూజచేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి



పోరంకి షిర్డీ సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి పూజలు

ఉయ్యూరు: గురుపౌర్ణమి పర్వదినాన్ని ప్రజలు సోమవారం ఘనంగా నిర్వహించారు. తోట్లవల్లూరు రోడ్డులో జ్ఞానసాయి మందిరంలో గురుపౌర్ణమి సందర్భంగా విశేష పూజలు జరిపించారు. ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి పాల్గొని సాయినాథుడికి పూజలు చేయించారు. వేలాది మంది భక్తులకు అన్నసంతర్పణ చేశారు. కేసీపీ సాయిబాబా ఆలయం, శివాలయం ఎదుట బాబా ఆలయంతో పాటు పలు చోట్ల గల సాయిబాబా ఆలయాల్లో గురుపౌర్ణమి ఘనంగా జరిగింది.

పోరంకిలో వైభవంగా గురుపౌర్ణమి

పెనమలూరు: మండలంలోని పోరంకిలో ఉన్న షిర్డీ సాయిబాబా మందిరంలో సోమవారం గురుపౌర్ణమిని అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీనివాసానగర్‌లోని సాయిబాబా మందిరంలో బాబాను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులు సాయిబాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి భజనలు చేశారు. ఈ సందర్భంగా ఐదువేల మంది భక్తులకు అన్నసమారాధన చేశారు.

కంకిపాడు మండలంలో..

కంకిపాడు: మండలంలోని కంకిపాడు, చలివేంద్రపాలెం, ఉప్పలూరు తదితర గ్రామాల్లోని సాయిబాబా మందిరాల్లో భక్తులు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రొద్దుటూరు శివారు గాయత్రీవిహార్‌లోని ధ్యానయోగసాయి మందిరంలో సాయినాథుడికి వివిధ పండ్ల రసాలతో, పంచామృతాలతో అభిషేకం చేయించారు.

ఇందుపల్లిలో ఘనంగా గురుపౌర్ణమి

ఉంగుటూరు: ఇందుపల్లి గ్రామంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కోశాధికారి వక్కలగడ్డ రామచంద్రరావు నేతృత్వంలో ఆలయ పండితులు విశిష్ట పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఐదువేల మందికి అన్నదానం చేశారు.

వీరవల్లిలో ఘనంగా గురుపౌర్ణిమ

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఆలయంలో పెదఅవుటపల్లి భజన సమాజం సభ్యులు సాయిబాబా నక్షత్ర మాలిక 108 సార్లు పారాయణం చేశారు. అమ్మవారిని శాకంబరిగా విశేషంగా అలంకరించారు. 2 వేల మందికి అన్న సమారాధన చేశారు. ఆలయ కమిటీ సభ్యులు కోడెబోయిన బాబి, రావి ఈశ్వరి, తవ్వా ఆదిలక్ష్మి, గుత్తా నాగమణి, లంకా బేబి సరోజిని పాల్గొన్నారు.

చినకంచిలో గురుపూజోత్సవం

నున్న(విజయవాడరూరల్): స్థానిక చినకంచిలో గురుపూజోత్సవం జరిగింది. గురుధామం వద్ద నారాయణాది గురుపరంపరకు విశేషపూజలు, అభిషేకాలు చేశారు. శ్రీవ్యాసపూజను యథావిధిగా నిర్వహించి సదానందస్వామి చాతుర్మాస్య వ్రతాన్ని ప్రారంభించారు. ఆలయ ధర్మకర్త మొక్కపాటి శర్మ, వేద పాఠశాల గురువు, విద్యార్థులు పాల్గొన్నారు. షిర్డిసాయిబాబా మందిరంలో విశేష పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెనమలూరులో ఇంటింటి సర్వే



పెనమలూరు: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా పెనమలూరు గ్రామంలో సోమవారం నుంచి ఇంటింటి సర్వే ప్రారంభించారు. గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం ఈ నెల 10, 12, 14 తేదీల్లో నిర్వహించనున్నారు. గ్రామంలో వలంటీర్‌లు ఇంటింటికి వెళ్లి ఈకేవైసీ తీసుకుంటూ సర్వే నిర్వహిస్తున్నారు. సమస్యలు ఉన్న వారు వలంటీర్లకు తమ సమస్యలు విన్నవించాలని అధికారులు తెలిపారు.

నేడు కానూరు-పోరంకిలో..

కానూరు, పోరంకిలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని తాడిగడప మునిసిపల్ కమిషనర్ ఎస్.ప్రకాశరావు సోమవారం తెలిపారు. ఉదయం కానూరు-4 సచివాలయం, పోరంకి-2 సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. మండలంలోని గంగూరులో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని ఈఓపీఆర్డీ కోరా శ్రీనివాసరావు తెలిపారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలి



ఉంగుటూరులో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న సర్పంచులు, ఎంపీడీవో

ఉంగుటూరు: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు. మండల కేంద్రమైన ఉంగుటూరులో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. అర్హత ఉండి సాంకేతిక కారణాల వలన సంక్షేమం అందని వారు సచివాలయాల్లో సంప్రదించాలని సూచించారు. అనంతరం సర్పంచులతో కలసి కుల ధ్రువీకరణ పత్రాలు 40, ఆదాయ పత్రాలు 38, ఆధార్ మొబైల్ లింక్ 36, హౌస్‌హోల్డ్ స్లీట్ 2 పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ బాషా, ఉంగుటూరు, ఎలుకపాడు గ్రామాల సర్పంచులు కె.వరప్రసాద్, పి.శ్రీరామ్, ఎంపీటీసీ సభ్యులు బి.సింహాచలం, సచివాలయ కన్వీనర్ వెంకటరమణ, రాజేంద్రప్రసాద్, నిర్మల కుమారి పాల్గొన్నారు.

కొనసాగుతున్న జగనన్న సురక్ష క్యాంప్‌లు

గన్నవరం: మండలంలోని అల్లాపురం, దావాజిగూడెం గ్రామ సచివాలయాల్లో సోమవారం జగనన్న సురక్ష క్యాంప్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా దరఖాస్తుదారులకు కుల, ఆదాయ తదితర ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఎక్కువమంది ఆధార్‌కార్డుకు సంబంధించిన సేవలను పొందినట్లు ఎంపీడీవో సత్యకుమార్ తెలిపారు. సర్పంచ్‌లు డొక్కు సాంబశివ వెంకన్నబాబు, బడుగు బాలమ్మ, పంచాయతీ కార్యదర్శులు కోటేశ్వరరావు, సత్యబాబు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

పెనమలూరు: మండలంలోని కానూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు గాయపడ్డారు. ఈ ఘటనపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. కానూరు కామయ్యతోపునకు చెందిన తుమ్మల ఉష, ప్రసాద్ భార్యాభర్తలు. వారు ఆదివారం బైక్‌పై పటమట రైతుబజార్‌కు వెళ్లి కూరగాయాలు కొన్నారు. తిరిగి కానూరు బయలుదేరారు. అశోక్‌నగర్ వద్దకు రాగా వెనుక నుంచి వచ్చిన వ్యాన్ వారిని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఉష, ప్రసాద్ రోడ్డుపై పడటంతో గాయపడ్డారు. వారిని హుటాహుటిన పోరంకిలోని ఓ ఆస్పత్రిలో చేర్చారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కానూరులో వ్యక్తి పై సోడాసీసాతో దాడి

పెనమలూరు: మండలంలోని కానూరులో ఓ వ్యక్తిపై మరో వ్యక్తి సోడాసీసాతో దాడి చేశాడు. ఈ ఘటనపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం మేరకు.. కానూరు సనత్‌నగర్‌కు చెందిన బొట్ల రవి విజయవాడ వన్‌టౌన్‌లో ప్రైవేటు పనిచేస్తాడు. అతను ఆదివారం మిత్రులు పవన్‌కుమార్, వెంకట్‌తో కలిసి సనత్‌నగర్ వద్ద ఉన్న బార్‌కు వెళ్లాడు. రవికి బార్‌లో చిన్ననాటి స్నేహితుడు శివబ్రహ్మం కనిపించాడు. రవిని తన బిల్లు చెల్లించాలని శివబ్రహ్మం అడగ్గా వాగ్వాదం జరిగింది. ఇది గొడవకు దారి తీయడంతో శివబ్రహ్మం సోడాసీసాతో రవిపై దాడి చేశాడు. గాయపడిన రవి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

అసంఘటిత కార్మికులుగా గుర్తించాలని వినతి

ఉయ్యూరు: మెకానిక్‌లను అసంఘటిత కార్మికులుగా గుర్తించాలని టూ వీలర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎండీ అక్బర్ బాషా కోరారు. యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఉయ్యూరులో ప్రపంచ మెకానిక్ దినోత్సవం నిర్వహించారు. మెకానిక్‌లు ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందించారు. అసంఘటిత కార్మికులుగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బాలగంగాధర్, రాజేష్, యూనియన్ నాయకులు జగన్నాథం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి శాకంబరి అలంకరణ







యనమలకుదురు, గన్నవరం, ఆత్కూరులో శాకంబరి అలంకారం

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పార్వతి సమేత శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో పార్వతి అమ్మవారికి వివిధ రకాల కూరగాయలతో శాకంబరి అలంకరణ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో శాకంబరి ఉత్సవాల సందర్భంగా భక్తులకు మంగళవారం అన్నసమారాధన నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.గంగాధరరావు తెలిపారు.


శాకంబరీదేవిగా శ్రీలక్ష్మీతిరుపతమ్మ

గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో సోమవారం శాకంబరీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆషాఢ మాసం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారిని శాకంబరీదేవిగా అలంకరించారు. ఉప సర్పంచ్ పాలడుగు నాని, గ్రామస్తుల సహకారంతో శ్రీగోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మ ఉత్సవ మూర్తులు, అంకమ్మతల్లి, మహాలక్ష్మీ మానును, ఆలయ ప్రాంగణాన్ని వివిధ రకాల పండ్లు, కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించారు. విజయవాడ కార్పొరేటర్ దేవినేని అపర్ణ సౌజన్యంతో భక్తులకు అన్నసమారాధన చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్, తిరుపతమ్మ మాతృమండలి సభ్యులు పాల్గొన్నారు.

శాకంబరీదేవిగా కనకదుర్గమ్మ

ఉంగుటూరు: మండలంలోని ఆత్కూరు కనకదుర్గ ఆలయంలో ఆషాఢ శుద్ధ పూర్ణిమ మూలా నక్షత్రం పురస్కరించుకుని అమ్మవారు శాకంబరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులు తమ మొక్కుబడులు చెల్లించుకుని అమ్మవారి ఆశీస్సులు ఉండాలని వేడుకున్నారు.

బ్యాడ్మింటన్‌లో ప్రతిభ చాటిన శ్రీహర్ష, అనూప్‌కు అభినందన



విజయవాడలో వైద్యులు శ్రీహర్ష, అనూప్‌లను అభినందిస్తున్న మైక్రో బ్యాడ్మింటన్ నిర్వాహకులు

గన్నవరంరూరల్: ఆలిండియా నేషనల్ డాక్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు ఆంధ్రప్రదేశ్ నుంచి చిన అవుటపల్లి డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అనుమోలు వెంకట నాగ శ్రీహర్ష, పామర్రుకు చెందిన డాక్టర్ అనూప్ ఎంపికయ్యారు. ఈ నెల 2వ తేదీన విజయవాడ దండమూడి రాజగోపాలరావు ఇండోర్ స్టేడియంలో జరిగిన మైక్రో బ్యాడ్మింటన్ కప్ డాక్టర్స్ టోర్నమెంట్‌లో వీరు ప్రతిభ చాటారు. ఈ పోటీల్లో 150 మంది డాక్టర్‌లు పాల్గొనగా వీరు ద్వితీయ స్థానంలో రాణించడం విశేషం. ఈ జట్టు 2024లో జరిగే నేషనల్ డాక్టర్స్ టోర్నమెంట్‌కు బెంగళూరుకు వెళ్లనుంది. ఈ సందర్భంగా శ్రీహర్ష, అనూప్‌లను సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ సి.నాగేశ్వరరావు, ఏవో వై.మధుసూదనరావు సోమవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రత్యేకంగా అభినందించారు.